క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పినపాక: ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. తహసీల్దార్ గోపాల కృష్ణ, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఎంపీవో వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ గుమ్మడి వినీత, ఏపీవో వీరభద్రస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి బెడ్లు వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మానసేవ అనాథాశ్రమానికి తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ విద్యానగర్ కొత్తగూడెం, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్, బాలానగర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రూ.30 వేల విలువ గల 6 ఐరన్ బెడ్లు ఆశ్రమ నిర్వాహకురాలు సరోజిని బుధవారం అందజేశారు. అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు, సురేష్ కుమార్, సీతారామ శాస్త్రి, రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించండి

అశ్వారావుపేటరూరల్: బీసీ రిజర్వేషన్‌కు మద్దతుగా ఈ నెల 18వ తేదీన నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో బంద్‌కు వర్తక, వ్యాపారులు సహకరించాలని బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్ కురిశెట్టి నాగబాబు కోరారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో బంద్‌పై పట్టణంలో ప్రచారం నిర్వహించి, అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సంకా ప్రసాద్‌ను కలిసి వినతి చేశారు. సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, బీసీ సంఘం నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, ఫకీరయ్య, లింగిశెట్టి వెంకటేశ్వరరావు, తాళం సూరిబాబు, రాంబాబు, లింగంకుంట కృష్ణ, పసుపులేటి ఫణింద్రం, సోమాని రాజా రమేష్ పాల్గొన్నారు.

ప్రజాసంఘాల మద్దతు


ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, వివిధ సంఘాల నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట వసతిగృహాల కార్మికులు చేసిన 72 గంటల ధర్నాకు టీఎన్జీఓ సంఘం డివిజన్ అధ్యక్షుడు డెక్క నరసింహారావు, కార్యదర్శి బాలకృష్ణలు మద్దతు పలికారు. బుధవారం సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ.. వేతనాలు తగ్గించటం చట్ట వ్యతిరేకమని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, జేఏసీ నాయకులు, సీఐటీయూ నాయకులు, హాస్టల్ వర్కర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

అశ్వారావుపేటరూరల్: మద్యం దుకాణాలకు టెండర్ల నేపథ్యంలో లంబాడీలకు కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వొద్దని తుడుందెబ్బ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి చేశారు. ఈ మేరకు బుధవారం సంఘం బాధ్యులంతా కలిసి స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణను కలిసి వినతి చేశారు. నాయకులు తంబళ్ల రవి, దుర్గారావు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

బూర్గంపాడు: బూర్గంపాడుకు చెందిన మేక స్వజన అండర్–19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనా నేపథ్యంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఆమెను సన్మానించారు. రాష్ట్రస్థాయి పోటీలలో రాణించి జాతీయస్థాయికి ఎంపికవ్వాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు భూపెల్లి నర్సింహారావు, పీఏసీఎస్ డైరెక్టర్ బొల్లు రవి, మాజీ ఎంపీటీసీ సభ్యులు జక్కం సర్వేశ్వరరావు, బానోతు శ్రీను, బొల్లు సాంబశివరావు, చెన్నం రవి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, కేవీ రమణ, రమణ పాల్గొన్నారు.

పోడుకు పట్టాలివ్వాలి

దుమ్ముగూడెం: ఆదివాసీలు సాగుచేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి సరియం కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెదబండి రేవు గ్రామంలో పోడుసాగుదారుల సమావేశం పాయం హరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య, సీపీఎం మండల కమిటీ సభ్యులు వాగే ఖాదర్ బాబు, అటవీ హక్కుల కమిటీ చైర్మన్ సోయం వీర్రాజు, సభ్యులు సోయం కనకారావు, కాకా సారయ్య సోయం గోపాలరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

రేగా హయాంలోనే అభివృద్ధి

గుండాల: బీఆర్ఎస్ హయాంలో పినపాక నియోజకవర్గానికి రేగా కాంతారావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే గుండాల మండలంలో అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసింది ఏమీ లేదని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కె.అన్వర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు మద్దతు తెలపాలన్నారు. టి.రాము, గడ్డం వీరన్న, నిట్ట రాములు, సయ్యద్ అజ్జు, తాటి కృష్ణ పాల్గొన్నారు.

భవనానికి ‘ఆయుష్షు’ పోసేదెన్నడు?

- ఊడిపడుతున్న పెచ్చులు.. బయటకు తేలిన రాడ్లు
- భయంతో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది
- భవనం దుస్థితితో ‘ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్’ దూరం


రాడ్లు తేలిన ఆస్పత్రి సీలింగ్


మరమ్మతులకు నోచుకోని కిటికీలు


ఆస్పత్రి వెనుక భాగంలో పిచ్చిమొక్కలు

కరకగూడెం: ప్రజల ఆరోగ్యానికి, ఆయుష్షుకు చిరునామాగా ఉండాల్సిన ఆస్పత్రి భవనమే ఇప్పుడు పెను ప్రమాదానికి చిరునామాగా మారింది. కరకగూడెం మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉంది. వైద్యులు, సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్నారు.

పెచ్చులు ఊడి.. రాడ్లు తేలి

ఆయుర్వేద వైద్యశాల భవనం స్లాబుల నుంచి తరచుగా పెచ్చులు ఊడిపడుతుండటంతో ఆస్పత్రిలోని ఉద్యోగులు, రోగులు ఆందోళన చెందుతున్నారు. పగుళ్లు పెరిగి స్లాబుల లోపలి స్టీల్ ఇనుప కడ్డీలు సైతం బయటకు తేలాయి. వర్షం వచ్చినప్పుడల్లా భవనం నిండా నీరు నిలిచి మరింత ప్రమాదకరంగా మారుతోంది. భవనం చుట్టూ, ఆవరణలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు దట్టంగా అల్లుకుపోయి అపరిశుభ్రతకు నెలవుగా మారింది.

మౌలిక వసతులు కరువు

భవనం శిథిలమవడమే కాకుండా కనీస సదుపాయాలు కూడా కరువయ్యాయి. మరుగుదొడ్లు పూర్తిగా పాడైపోయి నిరుపయోగంగా మారాయి. రోగులు, సిబ్బంది బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయాల్సిన దుస్థితి నెలకొంది. అత్యవసరమైన మంచి నీటి సౌకర్యం ఏ మాత్రం లేకపోవడంతో వైద్య సేవలకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమస్యలతో రోగులు ఆస్పత్రికి రావడానికి భయపడుతున్నారు.

కోల్పోయిన లబ్ధి..

ఆయుర్వేద వైద్యశాల భవనం నేడు పూర్తిగా శిథిలావస్థలోకి చేరి, ప్రజలకు మాత్రమే కాకుండా ప్రభుత్వ అభివృద్ధి పథకాలకూ అవరోధంగా మారింది. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ‘ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్’ పథకం, అలాగే నిర్మించాల్సిన యోగా షెడ్డు, లక్షల విలువ గల యోగా స్ట్రక్చరల్ మెటీరియల్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ నిలిచిపోయాయి. కేంద్రం నుంచి నిధులు మంజూరైనా.. భవనం దుస్థితి కారణంగా వాటిని వినియోగించే అవకాశం లేకుండా పోయింది. భవనం బలహీనంగా ఉండటంతో ఏ కొత్త సదుపాయాలు ఏర్పాటు చేయలేకపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం..

పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు, సిబ్బంది పలుమార్లు పైఅధికారులకు విన్నవించినా నిధులు లేవనే సాకుతో నేటికీ మరమ్మతులకు కానీ, నూతన భవన నిర్మాణానికి కానీ చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా శిథిలావస్థలో ఉన్న ఈ భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భయం వేస్తోంది..



మండల ప్రజలకు ఈ ఆయుష్ వైద్యశాల ఎంతో అవసరం. కానీ ఇప్పుడు భవనం పరిస్థితి చూస్తే భయం వేస్తోంది. గోడలు చిట్లిపోయాయి, కిటికీలు ఊడిపోయాయి. పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఇటువంటి భవనంలో వైద్యులు పని చేస్తూ, ప్రజలు చికిత్స పొందడం ప్రమాదమే. అధికారులు కనీసం ఇప్పుడైన కళ్లుతెరిచి కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– షేక్ రుషావలి, కరకగూడెం

ఉన్నతాధికారులకు నివేదించాం..



భవనం శిథిలావస్థలో ఉండటంతో మేము ఇబ్బందిగానే విధులు నిర్వర్తిస్తున్నాం. వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు జారిపడుతోంది. స్లాబ్ బలహీనంగా ఉంది. ఈ పరిస్థితుల్లో యోగా మెటీరియల్ వంటివి ఏర్పాటు చేయడం సాధ్యం కాలేదు. పేషెంట్ల భద్రత దృష్ట్యా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది అనుకుంటున్నాం.

– సిహెచ్.కుమారస్వామి, ఆయుష్ వైద్యాధికారి, కరకగూడెం

చట్టాలపై అవగాహన ఉండాలి


ఆశ్రమ పాఠశాల న్యాయ సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సూరిరెడ్డి

పినపాక: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, చట్టాలను గౌరవించాలని మణుగూరు జడ్జి సూరి రెడ్డి సూచించారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని ఐలాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలికలు ధైర్యంగా సమాజంలో ముందుకు సాగాలని, విద్యా వ్యవస్థలో నూతన వొరవడి సృష్టించాలని సూచించారు. చిన్నారుల పై దాడులకు సంబంధించి పోక్సో చట్టం, చైల్డ్ లేబర్ వంటి చట్టాలను రూపుదిద్దామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందస్తు అనుమతి తీసుకోవాలి


మాట్లాడుతున్న సీఐ పింగళి నాగరాజు

అశ్వారావుపేటరూరల్: దీపావళి నేపథ్యంలో బాణసంచా విక్రయాలకు ముందుగా అనుమతి పొందాలని సీఐ పింగళి నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అశ్వారావుపేట, దమ్మపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో బాణసంచా విక్రయాల దుకాణాల ఏర్పాటుకు పాల్వంచ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుని, అనుమతులు పొందాలన్నారు. అలాగే నిబంధనల ప్రకారమే దుకాణాలు నిర్వహించాలని, పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై రామ్మూర్తి, సిబ్బంది పాల్గొనారు.

సంక్షిప్త సమాచారం

సీసీ రోడ్డు నిర్మిస్తాం..

ములకలపల్లి: బురదమయంగా మారిన బీసీ అంగన్‌వాడీ సెంటర్ వీధిలో త్వరితగతిన సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు తెలిపారు. వానొస్తే వరదమయంగా మారుతన్న క్రమంలో బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి, వీధని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు తదితర మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యంగా పాలకపక్షం ముందుకు సాగుతోందని అన్నారు. పీఆర్ ఏఈ సురేష్‌కుమార్, ఖాదర్‌బాబా, సురభి రాజేశ్, పసుపులేటి గణపతి, కటికనేని ఆతిథ్య పాల్గొన్నారు.

‘ఉపాధి’తో అనుసంధానం చేయాలి

పినపాక: ఇందిరమ్మ ఇళ్లను ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయాలని ఎంపీడీఓ సునీల్ కుమార్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఈసీ వీరభద్రస్వామి, హౌసింగ్ ఏఈ వినీతతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 663 ఇల్లు నిర్మాణంలో ఉన్నాయని వారందరికీ ఉపాధి హామీ కార్డుతో అనుసంధానం చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపాధి హామీ కార్డు లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, దానికి అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పని లభించడమే కాకుండా త్వరతిగతిన పూర్తి చేయడానికి వీలవుతుందని తెలిపారు.

రహదారి వెంట చెట్లపొదలు తొలగింపు


చెట్ల పొదలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం మామిళ్ళవాయి రహదారికి ఇరువైపులా అడవిని తలపిస్తున్న చెట్ల పొదలను బుధవారం తొలగించారు. ఈ నెల 14న ‘రోడ్డుకు ఇరువైపుల చెట్లపొదలు’అనే శీర్షిక సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీఓ ముత్యాలరావు ఆదేశాల మేరకు జీపీ కార్యదర్శి నరేందర్ ఆధ్వర్యంలో రహదారికి ఇరువైపులా చెట్లను తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్..

మద్యం సీసాలు తొలగింపు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గాండ్లగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో కుప్పలుగా పడి ఉన్న ఖాళీ మద్యం సీసాలను తొలగించారు. ఈ నెల 11వ తేదీన ‘సాక్షి’దినపత్రికలో ‘మందుబాబులకు అడ్డాగా.. జీపీ కార్యాలయం’శీర్షికన ప్రచురితమైన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన ఎంపీడీఓ అప్పారావు.. కార్యాలయ ఆవరణను శుభ్రం చేయించాలని ఇన్‌చార్జ్ కార్యదర్శిని ఆదేశించారు. దాంతో కార్యదర్శి ఆధ్వర్యంలో సిబ్బంది జీపీ కార్యాలయం ఆవరణను శుభ్రం చేసి, సీసాలను తొలగించారు.

రాష్ట్రపతి భవన్ సందర్శన


సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి భవన్ ఎదుట ఉపాధ్యాయులు, విద్యార్థులు

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి భవన్‌ను బుధవారం సందర్శించారు. దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్‌పై ఫ్రూట్ కలెక్షన్స్ మెథడ్, బ్లైండ్ మాన్‌స్టిక్ అనే రెండు ప్రాజెక్టులకు ఎగ్జిబిట్ చేసేందుకు వారికి అవకాశం లభించింది. ఈ క్రమంలో ఎంఈఓ ఉండేటి ఆనంద్ కుమార్‌తోపాటు ఉపాధ్యాయులు శంకర్ మహాదేవన్, బీ వెంకటేశ్వర్లు, జయరాం, మోతీలాల్, బాలు, పద్మా, సుశీల, ప్రమీల, రాణి తోపాటు 37మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: అనారోగ్యంతో కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న పలువురిని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం పరామర్శించారు. మండలంలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన వెదర్ల కిరణ్, నాచారం గ్రామానికి చెందిన నక్కా మనీషా పలు అనారోగ్య సమస్యల కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే వారి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు.

సీహెచ్‌సీలో మొదటి ప్రసవం


సిజేరియన్ చేసిన వైద్యులు, సిబ్బంది

చర్ల: చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మొదటిసారిగా బుధవారం ఓ మహిళకు ప్రసవం చేశారు. కొత్తూరు నుంచి వచ్చిన గర్భిణి తన్నీరు రాజేశ్వరికి సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించినప్పటికీ పరిస్థితి అనుకూలించకపోవడంతో బుధవారం సిజేరియన్ నిర్వహించి శిశువును బయటకు తీశారు. ఆస్పత్రిలో మొదటి ఆపరేషన్ విజయవంతం కావడంతో పలువురు వైద్యబృందాన్ని అభినందించారు. కాగా, గతంలో ప్రసూతి సేవల కోసం అరవై కిలోమీటర్ల దూరంలో భద్రాచలం వెళ్లే పరిస్థితులు ఉండేవి. కానీ భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబుల చొరవతో గైనకాలజిస్ట్, పీడియాట్రిస్ట్, మరో మత్తు వైద్యుడిని నియమించారు. పది రోజుల క్రితమే వారు బాధ్యలు చేపట్టడంతో.. స్పెషలిస్ట్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆపరేషన్‌లో ప్రసూతి వైద్యురాలు శ్రావణి, పిల్లల వైద్యుడు రవి కుమార్, మత్తు వైద్యుడు శివరామకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ యూనిస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా మహిళలకు, యువతీ, యువకులకు ఉచిత విద్యా శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీజీఎం (పర్సనల్) ఎస్.రమేశ్ తెలిపారు. బుధవారం ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టైలరింగ్, కంప్యూటర్ డీటీపీ, స్పోకెన్ ఇంగ్లిష్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, ఫొటో షాప్, మల్టీమీడియా కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ, హైదరాబాద్ వారిచేత సర్టిఫికెట్ల అందజేస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను పాస్‌పోర్ట్ ఫొటోలతో ఈ నెల 30వ తేదీలోగా జీఎం కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

భద్రాచలంఅర్బన్: ప్రతి వాహనదారుడు, ప్రజలు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి రావు సూచించారు. బుధవారం పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయం వద్ద విద్యార్థులకు, ఆటో డ్రైవర్లు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా, మద్యం సేవించి, నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దని సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ జిల్లా జట్టుకు ఎంపిక


గుండాల: రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

గుండాల: అండర్–17 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఇటీవల ఎంపిక చేయగా.. గుండాలలోని గిరిజన గురుకుల విద్యార్థులకు చోటు దక్కింది. గురుకుల విద్యార్థులు ఇర్ప సన్నీ, ఆరెం నాగచైతన్య జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నారాయణనాయక్ తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాళ్లు సత్యనారాయణ, జ్యోత్స్న, పీఈటీ రవీందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

కబడ్డీ జట్టుకు..

మణుగూరురూరల్: ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టులో మణుగూరు మహాత్మాజ్యోతిరావు పూలే బాలుర గురుకులం విద్యార్థి అల్లం శివ ఎంపికయ్యాడు. ఈసందర్భంగా విద్యార్థిని ఆర్‌సీఓ సీహెచ్.రాంబాబు, డీసీఓ బ్యూలారాణి, ప్రిన్సిపాల్ రజిని, పీఈటీ ఎం.సురేష్, పీడీ పి.వెంకట్రావు, ఏటీపీ శంకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

మండలంలో ఏసీబీ దాడులు?

అశ్వాపురం: మండలంలో ఏసీబీ దాడులు జరుగుతున్నాయని మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా ప్రచారం జరుగుతోంది. రెవెన్యూశాఖ, పోలీస్‌శాఖ కార్యాలయాల్లో ఏసీబీ దాడులు జరగబోతున్నాయని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరిగింది. ఈ సమాచారం పుకార్లేనా, వాస్తవమా అని మండలంలో చర్చనీయాంశమైంది. కొన్ని శాఖల అధికారులు ఈ విషయంపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పుకార్లకే పరిమితమా, ఏసీబీ దాడులు జరుగుతాయా.. లేదా అన్నది వేచి చూడాలి.

ఫిట్టర్‌ను నియమించాలి


మణుగూరుటౌన్: ఏరియాలోని ఓసీ–2 ట్రావెల్స్, డోజర్ సెక్షన్‌లో పనులకు సరిపడా ఫిట్టర్‌లను నియమించాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. బుధవారం డోజర్ సెక్షన్‌ను సందర్శించిన ఆయన.. కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మునిగెల నాగేశ్వరరావు, బుద్ద వెంకటేశ్వర్లు, నవీన్, రాబిన్ తదితరులు ఉన్నారు.

అబ్దుల్ కలాం ఆదర్శనీయుడు

భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్ కలాం జయంతిని బుధవారం పలు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో నిర్వహించారు. కలాం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని అన్నారు. ప్రఖ్యాత శాస్త్రవేత్తగా రాణించి ‘మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా’గా పేరుతెచ్చుకోవడంతోపాటు దేశ రాష్ట్రపతిగా కలాం తనదైన ముద్రవేసుకున్నారని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరుటౌన్: కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయం, నాయకులు


భద్రాచలంటౌన్: అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీఎన్జీఓస్ నాయకులు


దుమ్ముగూడెం: కలాం జయంతి కార్యక్రమంలో ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు

వామ్మో ప్లాస్టిక్ బాటిళ్లు!

- డ్రెయినేజీకి అడ్డుపడి ముందుకు సాగని మురుగు
- రోడ్లపైకి చేరుతున్న చెత్తా చెదారం
- పారిశుద్ధ్య కార్మికులకు తలనొప్పిగా మారిన నిర్వహణ


అన్నదాన సత్రం వద్ద ఉన్న డ్రెయినేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ బాటిళ్లు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం మరింత ఎక్కువైంది. దుకాణానికి వెళ్లడం.. ప్లాస్టిక్ మంచినీటి బాటిల్ కొనుగోలు చేయడం.. నీళ్లు తాగిన వెంటనే పక్కనే ఉన్న కాల్వలో పడేయడం అలవాటుగా మారింది. ఆ ప్రభావం పారిశుద్ధ్యంపై తీవ్రంగా పడుతోంది.

కాలువల్లో అడ్డుపడుతూ..

మురుగు కాల్వల్లో వేలాది ప్లాస్టిక్ బాటిళ్లు నిండి ఉంటున్నాయి. సజావుగా ప్రవహించే మురుగు నీటికి అడ్డంకిగా మారుతున్నాయి. ఫలితంగా ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి మురుగు నీరు నడిరోడ్డుపై ప్రవహిస్తోంది. చాలా మంది దాహార్తి తీర్చుకోవడానికి బయట ప్లాస్టిక్ బాటిళ్లలోని మంచినీరు కొనుగోలు చేసి, నీళ్లు తాగిన తర్వాత డస్ట్‌బిన్‌లో గానీ, దుకాణాల వద్ద ఉండే చెత్త బుట్టల్లో గానీ పడేయటం లేదు. తోచిన చోట ఖాళీ అయిన బాటిళ్లను విసిరేస్తున్నారు. అలా ప్లాస్టిక్ బాటిళ్లు కాలువల్లో చేరుతున్నాయి. అవి చెత్తకు అడ్డం పడి మురుగు నీరు సాఫీగా ముందుకు సాగక రోడ్ల పైకి చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ కారణంగా వ్యాధులు కూడా వ్యాప్తి చెందుతున్నాయి.

మురుగు సమస్యకు ప్రధాన కారణం..

భద్రాచలం పట్టణంలో రోజుకో ప్రాంతంలో మురుగు కాల్వల్లో చెత్త పేరుకుపోయి. మురుగు నీరంతా ప్రధాన రహదారులపై ప్రవహిస్తోంది. భద్రాచలం గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా నిత్యం ఏదో చోట కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలు తొలగిస్తూనే ఉన్నారు. కానీ ఫలితం కనిపించడం లేదు. అందుకు కారణం ప్లాస్టిక్ బాటిళ్లేనని పలువురు చెబుతున్నారు. అందుకు ఉదాహరణగా.. ఇటీవల ప్రధాన కూడళ్లు.. వీధుల్లో కాల్వల ద్వారా మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో భద్రాచలం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది పనులు చేపట్టారు. అయితే వారు కాల్వలో పేరుకుపోయిన చెత్త తొలగిస్తుంటే.. అధిక సంఖ్యలో ప్లాస్టిక్ బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా పట్టణంలోని శిల్పినగర్ అన్నదాన సత్రం వద్ద ఉన్న మొయిన్ డ్రెయినేజీ వద్ద ఎప్పుడు కాలువలు శుభ్రం చేద్దామని చూసినా మురుగు, చెత్తతో నిండిపోయిన వందలాది ప్లాస్టిక్ బాటిళ్లు బయటపడుతున్నాయి. ఇవి చెత్తతో కలిసిపోయి ఉండటం వల్ల మురుగు నీరు సాఫీగా సాగక రోడ్లు మురుగు నీటిమయంగా మారి ఆ పరిసరాలు దుర్గంధంతో నిండిపోతున్నాయి.

కఠిన చర్యలు తప్పవు..



ప్లాస్టిక్ బాటిళ్లను వాడేవారు బాధ్యతగా వాటిని డస్ట్‌బిన్‌లో గానీ, చెత్త బుట్టల్లో గానీ వేయాలి. రోడ్డుపైన, కాలువల్లో పడేయడం వల్ల చెత్తకు అడ్డుపడుతాయి. పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకంగా మారుతాయి. ఈ నేపథ్యంలో ఎవరైనా ప్లాస్టిక్ బాటిళ్లను కాల్వల్లో పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకారం అందించాలి.

– సీహెచ్ శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ ఈఓ, భద్రాచలం